# పురోగాములు

"వల్లపురెడ్డి"

ఇంట్లో పాలు పోసి పామును పెంచుకుంటున్నా నన్న సంగతి ఇన్నాళ్ళూ స్ఫురించనే లేదు. పదిహేను సంవత్సరాల నించీ చదువు సంధ్యలు వెలి గిస్తున్న మా వాడు ఉండుండీ ఇంతకు తెగిస్తాడని కలనైనా అనుకోలా. చదవేస్తే ఉన్నమతి పోయినట్లు, వాడికి నన్ను — తండ్రి ముండావాడిని కదా అని—కాస్త గౌరవించడంకూడా తెలియకపోయిందే! నలు గురి ముందరా, అదిన్నూ నన్ను గౌరవంగా చూసేవాళ్ళ ముందర .... వియ్యమందడానికి బోలెడాశతో వచ్చిన వాళ్ళముందర నన్ను అవమానపరిచాడు. వీడూ ఒక కొడుకేనా నాకు? ఎవడో పాషండుడు! ఆఖరుకు వీడిలా అవుతాడని ముందే తెలిస్తే ఇంతదాకా రానిచ్చే వాడినా? పుట్టిన్నాడే పీక నులిమివేయక పోదునూ? కనీ, పెంచీ, విద్యాబుద్ధులు చెప్పించినందుకు నా పరువు చక్కగా నిల బెట్టాడు! హుఁ, వెధవ....' ఇదంతా సుబ్బా రాయుడి హృదయంలో కుతకుత ఉడుకుతున్న ఆవేదన. ఐనా లోపలే ఉండలేక ముఖకవళి కల ద్వారానూ, పెదవుల సందున వెలువడు తున్న అస్పష్టమైన మాటల ద్వారానూ వెలువ లికి పొంగుతూఉంది. సుబ్బారాయుని హృద యంలో పరాభవాగ్ని జ్వాలలు నాల్కలు సాచి నలువైపులా పరువెత్తుతున్నయ్.

ఆరువేల రూపాయల కట్నంతో కన్యాదానం చేస్తామనివచ్చిన పెద్ద మనుషుల దగ్గర పెడసరపు మాటలు — తనకు తగనివి — మాట్లాడి సంబంధాన్ని భంగ పరచిన కొడుకు కామేశ్వర్ పైన అతనికి క్రోధం ముంచుకొస్తూంది క్షణక్షణానికి.

నిన్న మొన్నటి కుఱ్ఱకుంక. జేనెడు లేడు; వీడికేవో ఆశయాలట! ఆదర్శాలట!! వీడి మొహం. నిన్నగాక మొన్న కళ్ళు తెరిచాడు, సరిగా ఇరవైఐదేళ్లు దాటలేదు. వీడికే ఇన్ని ఆశయాలూ, ఆదర్శాలూ ఉంటే నాకుమాత్రం ఉండవూ? నేనుమాత్రం వాడికి ఏ ఆశయంతో, ఏ ఆదర్శాన్ని చేరుకోవాలని బోలెడు డబ్బు తగలేశాను? తీరా రెక్కలువచ్చి నన్ను తిరస్క రిస్తాడా? ఒకటిగాదు, రెండుకాదు; మొత్తం ఆరువేలే! నిక్షేపంలాంటి సంబంధాన్ని నీటి పాలు చేశాడు. ఏదో వాళ్ళు మొదటి మాటగా ఆరువేలన్నారుగాని, ప్రయత్నిస్తే ఏ ఎనిమిది వేలో ఇవ్వటానికి ఒప్పుకునేవారు. ఇంత మంచి సమయాన్ని చేజారిపోనిచ్చాడు ఛండాలుడు! తను ఆ జన్మాంతమూ చెమటోడ్చి, కడుపు గట్టి సంపాదించినా ఎనిమిదివేల రొక్కం వెనక్కి వేయగలుగుతాడూ? తెకతేరకు తిన మరిగి కళ్ళు కన్పించకండా ఐపోయినై. పొర లొచ్చినట్లున్నయి! ఇంట్లోంచి వెడలనడిపితే గాని తెలిసిరాదు వెధవకి!.... ఉద్యోగం సంపా దించుకుంటాననే గర్వం ఉందేమో!

కథానిక

కాని ఈ రోజుల్లో ఉద్యోగా లెవ రిస్తారు? గగన కుసుమం. జీవనో

పొధికి కాళ్ళరిగేట్లు ఆఫీసుల చుట్టూరా తిరిగి, తిండికి కూడా కరువై చివరికి కాలిబాట మీద దొరలే గతి వచ్చిన్నాడు.... మళ్ళీ తండ్రి జ్ఞాపకం వచ్చి, "నాన్నా! మీరేం చెప్పినా చేస్తాను. నన్ను క్షమి చండి" అంటూ.... —సుబ్బారాయుడు ఆలోచనలకి కళ్ళెం బిగించ లేకపోతున్నాడు. ఆయన తనకు జరిగిన పరా భవానికి ప్రతీకారం చెయ్యాలనీ, తనమాటను పెడచెవినిబెట్టి, వచ్చే లక్ష్మికి మోకాలొడ్డిన కొడుక్కి బుద్ధి తెప్పించాలనీ ఏమేమో ఆలో చిస్తున్నాడు.

దందహ్యమాన మానసుడై, ఎటూ తోచక గదిలో అటూ ఇటూ పచారుచేసి తుదకు కుర్చీలో కూలబడ్డాడు బల్లముందు. బల్లమీద పుస్తకం చేతబట్టుకున్నాడు ఉద్దేశరహితంగా. వెంటనే దృష్టి అప్రయత్నంగా కవరు పేజీపైన పడింది. 'కామేశ్వర్, బి. ఎ.' అగుపడింది. రెండు పెదవుల్నీ పిండి దాన్ని కిటికీలోకి గిర వాటేశాడు. అది ఊచలకు తగిలి, సగానికి తెరచుకుని రెక్కలు విరిచిన పక్షిలాగు లోపలి వైపే పడింది. 'వెధవ! రెండు ఇంగిలీషు అక్ష రాలు చదువుకున్నంతమాత్రాన రెక్కలు మొలి చినాయనుకుంటున్నాడేమో! ఇంటికి రానీ, వాడి పని చెప్తాను,' అనుకున్నాడు.

సాయంత్రమైంది. సుబ్బారాయుడు కూర్చున్న చోటునించి కదల్లేదు. కొడుకు ఆ సమయాని కల్లా ఇంటికి రావాలి. వచ్చీ రావడంతోటే వాడికీ, తనకూ సంబంధం లేదని చెప్పేద్దా మనుకున్నాడు. ఎంచేతో వాడింకా రాలేదు. కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు.

తలుపు త్రోసిన చప్పుడైంది. తనెవరి కొఅకు ప్రతీక్షిస్తున్నాడో వాడు రాలేదు. చేతిలో లాంతరు పట్టుకుని భార్య ప్రవేశిం చింది. మెల్లిగావచ్చి లాంతరును బల్లమీద ఉంచింది. తిరిగి వెడుతూ ఆగిందామె. భర్తతో ఏదో మాట్లాడుదామనుకుంది. కాని ధైర్యం చాలక జంకుతూ నిల్చుంది.

"నీ సుపుత్రుడొచ్చాడా?" — సుబ్బా రాయుడే ప్రశ్నించాడు. అతనిలో పరవళ్ళు త్రొక్కుతున్న క్రోధావేశము ప్రశ్నలో కావలసి నంత వ్యంగ్యాన్ని నింపింది. అతను కిటికీ లోంచి చూపులను మరల్చకుండానే అడిగాడు.

"ఊహు(!"—ఆమె బాధా సమ్మిళితమైన స్వరంతో అంది.

అతను మాట్లాడలేదు.

కాస్సేపు మౌనం అనుభవించి, భరించలేక భర్తతో అంది, "ఏమండీ, కుఱ్ఱవాడేదో తెలీక అన్న మాటలకి మీరింత కోపం తెచ్చుకుంటే ఎట్లాగు? వాడింకా ఇల్లు చేరలేదు. పోయి చూసి వద్దురూ?"

అణగ త్రొక్కి వదలిన బలమైన స్ప్రింగులా లేచాడు సుబ్బారాయుడు. "నువ్వు కూడా ఒక జోలీ కట్టుకుని వాడితో కలిసిపో. నాలు గిళ్లు ముష్టెత్తి పోషిస్తాడు. వెళ్లు." అని గది మాడు. "కుఱ్ఱవాడట, కుఱ్ఱవాడు! అడ్డాల నాడే బిడ్డలు గాని గడ్డాలనాడు బిడ్డలా?" అని గొణుక్కుంటూ ఎఱ్ఱబారిన ముఖంతో కుర్చీలో పడ్డాడు, చైతన్య రహితంగా.

ఆమె వణకిపోయింది. మరి మాట్లాడలేక నిశ్శబ్దంగా నిష్క్రమించింది.

రాత్రి ఎనిమిదింటికొకమారొచ్చిందామె ఆ గదిలోకి, భర్తని భోజనానికి పిలిచే ఉద్దేశంతో. భర్త కూర్చున్న చోటు నించి కదలి ఉండక పోవడం మూలాన, అతను కొడుకు ప్రవర్తనకు ఎంతగా బాధపడుతున్నాడో గ్రహించింది. అంచేత పిలవటం మాట ప్రక్కకు నెట్టి, "ఏమండీ, వాణ్ణి గురించి ఇంతబాధపడ్డం ఏమీ బాగులేదు. ఏదో సాటివాళ్లు వరశుల్కం తీసికోకండా పెళ్ళి చేసుకోవడమే ఈ రోజుల్లో గౌరవప్రదమని భావిస్తున్నారు కాబట్టి వాడలా చెయ్యడానికి ఊహించి ఉంటాడు. మీ కిష్టం లేకపోతే వాడొచ్చాక ఒక మారు చెప్పి చూడండి. మీరు కాదంటే వాడు మాత్రం వినక ఏం చేస్తాడు?" అంది, తగ్గు స్వరంలో, అతని కోపం రెచ్చని విధంగా.

అతనేమీ మాట్లాడలేదు. కాని భార్య చెప్పింది సంపూర్ణంగా విన్నాడు. కొంతవరకు ఆమె మాటలు మనస్సు కెక్కినాయి.

''వాడింకా భోజనానికి రాలేదు. ఎక్కడున్నాడో! మీరు లేవండి, భోంచేద్దురుగాని'' అందామె.

సుబ్బారాయుడు మారు పలక్కుండా లేచి, ఏదో ఇష్టం ఉండీ లేనట్టుగా కొంచం ఎంగిలి పడి తన పడగ్గదిలోకి వెళ్ళాడు.

నిద్రపట్టక పన్నెండు గంటలప్పుడు సుబ్బారాయుడు కొడుకు గది దగ్గరికి వెళ్ళి చూశాడు. గదిలో లాంతరు మాత్రం వెలుగుతూంది కామేశ్వర్ రాలేదు. అతను బాధపడ్డాడు. గదిలో లాంతరు రోజూవలెనే వెలుగుతున్నా అతనికి మసక మసగ్గా కన్పించింది. దాని క్కారణం కొడుకు ఇంట్లో లేకపోవడమే అని తట్టింది. ఇల్లంతా నిర్మానుష్యంగా, భీకరంగా, పరేత నిలయంలా గోచరించింది. ఏదో భయంతో వణకిపోయాడు.

భార్య పడుకున్న గదిలోకి వెళ్ళాడు, ఆదరాబాదరాగా. అతడు తలుపు నెట్టుకు రావడం వల్ల కలిగిన శబ్దానికి ఆమె ప్రక్క మీదినించి లేచింది సుబ్బారాయుడు దగ్గరికివెళ్ళి ఆమె ప్రక్కన కూర్చున్నాడు. ఏమో మాట్లాడుదామనుకున్నాడు, కాని నోరు రాలేదు. ఆమె కళ్ళల్లో నీళ్ళు మాత్రం కన్పించాయి, క్రిందికి జారి పడుతూ. అతడు ''ఏమిటి? ఎందుకి ఏడుపు?'' అన్నట్లు చూశాడు ఆమెలోకి.

''ఏమండీ, ఒక మాట....'' చెప్పలేక పోయిందామె.

''ఏమిటి, చెప్పు?''—అన్నాడతడు అనునయిస్తూ.

ఆమె కొంచం ధైర్యం చిక్కబట్టుకుని చెప్పింది, ''మనకు ఉన్నది ఒక్కగా నొక్క సంతానమే కదా! వాడి కోరిక తీర్చక పోతే ఎట్లాగు? అమ్మాయిని చూసి రావడానికి వెళ్ళేప్పుడే అన్నాడు, పెళ్ళిలో వరకట్నం మాట ఎత్తితే ఇల్లువిడిచి పోతానని.'' గొంతు గాద్గదికమైంది. కొంగుతో కళ్ళు ఒత్తుకుంటూ మౌనం వహించింది.

''వాడికరాడా?''—ఆతృతతో ప్రశ్నించాడు

''ఏమో! వస్తేమాత్రం మీరు వాణ్ణేమీ అనకండి. నయాన చెప్పి చూడండి. వినక పోతే వాడిష్టప్రకారమే కానీయండి.''

సుబ్బారాయుడు 'ఔను; కాదు' అనకండా ఆ గదిలోంచి తన గదికేసి వెళ్ళాడు. వెళుతూ 'వరకట్నం తీసికోక పోతే మాత్రమేం?' అని ప్రశ్నించుకున్నాడు. వెంటనే ''లక్ష్మీనారాయణ తనతో సమానమైన హుందాలో ఉండి తన కొడుక్కి పదివేల కట్నం తీసుకున్నవాడు, 'ఏహేయ్ సుబ్బారాయుడూ! కొడుకుని ఇంత చదివించింది గంగపాల్జేయటానికేనా?' అని గేలిచేయడూ?'' అనే ప్రతిధ్వని ఎక్కణ్ణుంచో-స్వీయదురభిమానంలోంచి కామాలు-వచ్చింది రాత్రంతా ఇందుకు సంబంధించిన ఘర్షణలోనే సతమత మయ్యాడు.

మర్రోజు ఉదయం నలుగురు యువకులు ఇంటి కొచ్చారు. వాళ్లు కొడుకు పక్షాన వచ్చిన రాయబారులేమో అనుకున్నాడు సుబ్బారాయుడు. ''కామేశ్వరంగారున్నారాండీ?'' అని ప్రశ్నించా డొకడు.

''లేడు'' — క్లుప్తంగా సమాధానించాడు సుబ్బారాయుడు.

''మీరెవరు నాయనా?'' అని ప్రశ్నించింది, అప్పుడే లోపల్నుంచి వచ్చిన సుబ్బారాయుడు భార్య.

''మేం వరకట్న నిర్మూలన సంఘ ఆహ్వాన సంఘసభ్యులమండీ! ఇవాళ సాయంత్రం ఐదు గంటలకి పెద్ద మైదానంలో వీరి ఉపన్యాసం ఉంది. స్వాగతం చెప్పడానికి వచ్చాం.'' అన్నారు.

సుబ్బారాయుడేమీ అనలేదు. భార్యే చెప్పింది, ''మరి ఈ సంగతి వాడికి తెలీదేమో! నిన్న వెళ్ళాడు. వచ్చేదీ రాందీ తెలీదు.''

''మూడు రోజుల క్రితం ఆహ్వానం పంపాం. తప్పకండా తెలిసి ఉంటుంది. వస్తానని అంగీకారం కూడా తెలిపారు.'' ఈ మాటలు చెప్పి ఆగంతకులు వెళ్ళిపోయారు.

కొడుకుని తీసుకు రావాలనే ఉద్దేశంతో సుబ్బారాయుడు భార్యని వెంబడించుకుని సభాస్థలానికి వెళ్ళాడు సాయంత్రం. కామేశ్వర్ ఇచ్చిన ఉపన్యాసం గంభీరంగా ముగిసింది.

అందరూ వేనోళ్ళ పొగిడారతణ్ణి. కామేశ్వర్‌కు తలిదండ్రులయినందువల్ల సభానదులందరూ వాళ్లపట్ల ప్రదర్శించిన అనన్యమైన భక్తిగౌరవాలకు నిర్ఘాంతపోయారు. కొడుకు ఉపన్యాసం ఇస్తుంటే వరశుల్కానికి చేతులు చాచిన తన విషయం ఏమైనా ఎత్తుతాడేమో, తన్మూలంగా శ్రోతల్లో కలిగే ఆవేశానికి తను గురౌతాడేమోనని గుండె దిగులుగా ఉండింది. కాని అలాంటిదేమీ జరక్కపోగా గొప్పగొప్పవాళ్లంతా తమని స్తుతించడం జరిగింది.

చనువుగా వీపు తట్టుతూ "సుబ్బారాయుడు గారూ, సంఘాన్ని సంస్కరించటానికి అమూల్యమైన రత్నాన్ని ప్రసాదించారు"-అన్నారు మంత్రిగారు. వినయంతో తల వొంచుకున్నాడు అతను.

"ఏమయ్యోయ్! చదువుకున్న అబ్బాయిలు కల తండ్రుల నోళ్ళల్లో దుమ్ము కొట్టావ్?"—అన్నాడొక మిత్రుడు. 'బాగాచేశాను,' అందామనిపించింది. కాని అనలేదు.

"అబ్బాయిని అదుపులో ఉంచక అనవసరంగా పదివేలు చేజార్చుకున్నారండి"—అన్నాడొకతను. 'ఛ, వెధవ పదివేలు,' అనే మాట పెదవులదాకా వచ్చింది. కాని ఆగిపోయింది.

సుబ్బారాయుడు తనకు సభలోకలిగిన గౌరవంచూశాక ధనలక్ష్మిని విడిచి, కీర్తిలక్ష్మివైపు ప్రభావితుడయ్యాడు. ఉపన్యాసానంతరం కొడుకు కన్పించలేదు. వాడిలోని సుప్రసన్నత చూశాక తప్పకండా ఇల్లు చేరతాడని నిర్ణయించుకుని వెళ్లాడు భార్యతో.

మూడోరోజున ఉదయం, కామేశ్వర్ ఇంకా రాకపోవడంవల్ల, భార్య ఒత్తిడిచేత సంఘ కార్యాలయానికివెళ్ళే సమయంలో ఒకఅబ్బాయి వచ్చి ఒకకవరు చేతికిచ్చాడు. అబ్బాయిని కూర్చోనియమించి తాను ఆ ఉత్తరాన్ని చదవడంలో నిమగ్నుడైనాడు. భార్యకూడా ప్రక్కనే నిలబడి ఉత్తరంలోని విషయాల్ని చదవసాగింది:

నాన్నగారూ—

కలిసివచ్చిన సంబంధాన్ని కాలదన్నానని నామీద మీకు కోపం వచ్చిఉంటుంది. ఆ సమయంలో నేను మళ్ళీ ఇంటికివస్తే మీరు ఉక్రోషంలో రక్తబంధాలుకూడా త్రెంచుకుంటారని రాలేదు. ఈ మూడురోజులనించీ నే నెక్కడున్నసంగతి మీరు కనుక్కోవడానికి ప్రయత్నించే ఉంటారు. నావట్ల మీకుఉన్న ఘనతరమైన వాత్సల్యం ఆ మాత్రం ప్రేరేపించకండా ఉంటుందని నేనే కాదు, ఎవ్వరూ విశ్వసించలేరు. అందుకు నా నమోవాకాలు.

నిజం చెప్పాలంటే ఆ సంబంధాన్ని నేను త్రోసిపుచ్చలేదు. వాళ్ళకే ఇష్టంలేకపోయింది. నే నడిగినప్రశ్న మొరటుగాతోచి అవమాన భారంతో వాళ్లు వెళ్ళిపోయారు. కన్యనిస్తూ 'ఆరువేల రొక్కం సమర్పించుకుంటాం' అంటే నేనుండబట్టలేక 'మీ కూతురు ఏం తప్పచేసిందని అంతటి జరిమానా చెల్లించుకుంటున్నారు?' అని అడిగాను. అది నాతప్పు. అవును. మీ అభిప్రాయప్రకారం నేనలా కల్పించుకోకండా ఉండాల్సింది. కాని పరిస్థితులూ, నా భవితవ్యమూ అలా అడిగించినాయి. నా ప్రవర్తనకు నేనే పశ్చాత్తాప పడుతున్నా నిప్పుడు. ఆలోచించిచూస్తే నామీద నాకేమీ హక్కులేనట్లు అగుపడింది. నన్ను మీరు కన్నారు, మీరు పెంచారు; మీరే విద్యాబుద్ధులు చెప్పించారు. అంచేత నేను మీవాణ్ణి. మీరు నన్నేమైనా చెయ్యొచ్చు.

ప్రస్తుతం నేను 'వరకట్న నిర్మూలన సంఘం'లో అతిథిగా ఉన్నాను. సంఘం నాకు ఆ జన్మాంతమూ పోషకత్వం వహిస్తుందట. నమ్మకంలేకపోతే ఇప్పుడే కొంత ధనాన్ని నాపేర వేసుకోవచ్చునంది. నేను సంఘాన్ని చేతిలోకి తీసుకుని నడిపి, సంస్కరించాలట. తద్ద్వారా మానవకళ్యాణం చెయ్యాలిట. నేను స్వతంత్రుడినైతే, నాకూ వ్యక్తిత్వంఅనేది ఒకటుంటే, నేనందుకు ఒడంబడేవాణ్ణి. నేను మీ కుమారుణ్ణి కనుక అందుకు ఒప్పుకోలేదు. ఎప్పుడు మీరువస్తే అప్పుడే నాకు వెళ్ళటానికి అనుమతి ఇవ్వవలసిందిగా వారిని కోరాను. వారు కష్టంగా ఒప్పుకున్నారు. వలిస్తే మీరొచ్చి

నన్ను వెంబడించుకు వెళ్ళొచ్చు. ఇకముందు మీ ఆజ్ఞానువర్తినై నడచుకుంటాను. అయితే ఒక్కమనవి. నేనువ్రాస్తున్న ఉత్తరం పూర్తిగా చదువుకొని, ప్రశాంతచిత్తంతో గ్రహించుకొని రండి. ఎంచేతంటే ఇది నా హృదయానికి ప్రతిబింబం.

నాన్నా! మీరు నన్ను కనీ, పెంచీ ఇంతటివాణ్ణి చేశారు. నాలాంటి పితృవాక్యపరిపాలనాజ్ఞానశూన్యుణ్ణి కనేకంటే కనకపోవడం బావుండేది. మీరు నన్ను వాత్సల్యామృతం పోసి పెంచినందుకు ఆజ్ఞోల్లంఘన కాలోరగవిషాన్ని ప్రతిగా యిచ్చాను. మీ మనస్సుని కష్టపెట్టాను. నేనులేకపోతే మీకీవ్యథ ఉండేదా? ఇక్కడే నాకొక సందేహం జనిస్తూంది. తలిదండ్రుల వాత్సల్యం సర్వోత్కృష్టమైందనీ, పవిత్రమనీ, భగవత్స్వరూపమనీ మనధర్మమే కాక ప్రపంచంలోని సర్వధర్మాలూ చెబుతాయి. ఈ మాటే మీ ముఖతః చాలామార్లు విన్నాను. అయితే మీకూ నాకూ ప్రస్తుతం వచ్చిన వైభేద్యం ఎక్కడ? అశాశ్వతమైన కొన్ని వెండికాసులదగ్గరే కదా! దీన్నిబట్టి చూస్తే ఈ వాత్సల్యంకంటే ధనానికి విలువ అధికంగా ఉన్నట్టు ఋజువవుతూంది. కొంత ధనానికి మీ వాత్సల్యాన్ని, నేను, అమ్ముడుపోగలుగుతానన్నమాట. ఎంతమాట! ఇన్నాళ్లూ మీ ప్రేమని నేను అకళంకమైందిగా, నిస్స్వార్థమైందిగా భావించాను. ఈ నాడు ధనంతో దాన్ని తూచలేను. పాపం శమించుగాక!

ధనం నశ్వరమా, అనశ్వరమా అనేసంగతి ఇక్కడ నేను చర్చించను. ఆధునిక ప్రపంచంలో ధనానికి ఉన్న వైశిష్ట్యం నాకు తెలియనిదికాదు. ధనం నశ్వరమైందని ముముక్షువులకి మల్లే దాన్ని త్రోసిపుచ్చలేను. కాని దాన్ని ఆర్జించడంలో ఇతరుల జీవితాలు బుగ్గి అయిపోని విధానం మనకు వాంఛనీయం. ఆడపిల్లలు ఉన్న తలిదండ్రుల ఘోషలు మనం రోజూ వింటూనే ఉన్నాం. వార్తా పత్రికల్లో చదువుతూనే ఉన్నాం. కళ్ళారా చూస్తూనే ఉన్నాం. వరకట్నాలకు కరాలు సాచుతున్న పిశాచి లోకంలో, ఆ మధ్య నెల్లూరులో ఒకాయన ఎదిగిన కూతుళ్ళ వివాహాలు చెయ్యలేక ఉరిపోసుకు చనిపోలేదా? ఒకమ్మాయి రైల్లోంచి కృష్ణలోకి దుమికి మృత్యువుని పరిణయమాడిన సంగతి వినలేదా? అంతెందుకు? మనింటి ప్రక్క శర్మగారి భార్యగతి ఏమైంది? కొంగు తగుల్చుకుని దహనం కాలేదా? ఇవన్నీ మనకు తెలును. వీటికి మూలకారణాలుగూడా తెలును. హృదయాన్ని విదళించే ఈ ఘటనలనుగురించి విన్నప్పుడు "అయ్యో! పాపం!!" అని సానుభూతికూడా కన్పరచాం. ఇంత చేసీ ఇప్పుడు మనం ఆ పోరాని దారినే పోతే ఏం బాగు?

ఏదో నా వివాహ విషయంలో సర్వాధికారాలూ నాకే ఇస్తున్నట్లు, వెళ్ళి అమ్మాయిని చూసిరమ్మన్నారు. చూసి వచ్చి అభ్యంతరం లేదన్నాను. ఇక తరువాతి కార్యక్రమమంతా మూడు ముళ్లు వడేయడమే కదా! అయితే ఈ డబ్బుకు సంబంధించిన సంప్రదింపులేమిటి? అడిగినంత వరశుల్కం వాళ్ళివ్వకపోతే, మీరు నాకు నచ్చిన అమ్మాయిని కూడా ఎగరగొట్టేస్తారన్నమాట. అంత కొంఅకు నన్ను వెళ్ళి చూసి రమ్మనడం దేనికి? మీరే వెళ్ళి చూసి వచ్చి ఉంటే సరిపోయేదే? డబ్బే ప్రధానమైనప్పుడు ఎవరు వెళ్ళి చూసిరావడం మాత్రమే మవసరం?

వియ్యం నెరపటానికి వచ్చిన వాళ్లు ధనవంతులంటారేమో మీరు! అయితే కావచ్చు. మనమేమీ వీధిన బడి అడుక్కు తినడంలేదే? మనకూ తిండికీ, బట్టకూ ఒకర్ని యాచించే అవసరంలేదు. ఇంకా నలుగురిని పోషించగలుగుతాం. అసలు దేన్నిబట్టి కలిగిన వాళ్లని నిర్ణయించాలి? గుండెమీద బరువులా ఉన్న కన్నె చెర వదలించుకోవడం కోసం ఆరువేలు ఇస్తాననడం ఆస్తి పరత్వాన్ని నిర్ణయిస్తుందా? ఎక్కణ్ణుంచో అప్పు తెచ్చి, వివాహ మంటపంలో వరుడి చేతిలో క్రుమ్మరించి, తత్కాలానికి సంబరపడి, తరువాత అప్పు తీర్చలేక కుమిలిపోయి బజారు బ్రతుకు నీడుస్తున్నప్పుడు ఎలా ఉంటుంది? వాళ్లు మన దగ్గర కొన్నది బాంధవ్యమా, మరణమా? అప్పుడు గాని తెలిదు. పోనీ, మీ మాట ప్రకారం వాళ్లు వాస్త

వంగానే ధనికులు అనుకుందాం. అంత మాత్రాన వాళ్ళ ధనం మనకు రావాలని ఎక్కడుంది? మనం ఇతరుల్ని చూసి జాలిపడాల్సిన గుండె కలవారం. మనం ఇవాళ ఆరువేల వరశుల్కం తీసుకుంటే మన ఇరుగు పొరుగు వాళ్ళలోనూ, బంధుగుల్లోనూ ఉన్న యువకుల తండ్రులు 'ఆ సుబ్బారాయుడు తన కొడుక్కి ఆరువేలు తీసుకున్నాడు. మా అబ్బాయేం తక్కువా?' అని మిమ్మల్ని ఉదాహరణంగా తీసికోరూ? అది క్రమంగా ఆచారం ఐపోదూ? ఆ ఆచారాన్ని లోపంలేకండా నిర్వర్తించటానికి ఎందరమ్మాయిల తండ్రులు గొంతుల కురి బిగించుకోవాలి? నేను మీకు ఒక్కగా నొక్క కొడుకును గాబట్టి సరిపోయింది. నాతోబాటు ఇంకో నలుగురు ఆడపిల్లలుంటే నలుగురికీ నాలుగు ఆర్లు ఇరవైనాలుగువేలు ఇవ్వడానికి మీరు ఒప్పుకునే వారేనా? ఇవన్నీ మీకు తెలియని సంగతులు కావు నాన్నగారూ! కాని ఆవేశంలో మరచిపోయి ఉంటారని మళ్ళీ ఒకసారి స్మృతికి తెస్తున్నాను.

మనం ధనవంతులం కాకపోయినా బీదవాళ్లం మాత్రం కాము. మీరు నాకు 'మనం బీదవాళ్లమే' అని సంజాయిషీ చెప్పవచ్చు. ఒప్పుకుంటాను. మన దగ్గర వెండి, బంగారు కానుల రూపంలో ధనం తక్కువ ఉండొచ్చు. కాని ఆత్మాభిమాన ధనం తక్కువ లేదుగా! ఆత్మాభిమానం కల వాళ్ళెవరూ ఇతరుల ఆస్తి అన్యాయంగా తమకు సంక్రమించాలని అనుకోరు. ఎంత బీదవాడైనా సరే, తనకు స్వతహాగా భార్యని పోషించే స్తోమతు ఉంటేనేగాని ఏ యువకుడూ పెళ్ళి తలపెట్టగూడదు. పెళ్ళి చేసుకుని, కన్యాదానం చేసిన వాళ్ళమీద పరాన్నజీవి (Parasite) గా బ్రతికే వాడికంటే నీచుడు నా దృష్టికి కన్పడడు. మన దగ్గర బాంధవ్యం కుదుర్చుకోడానికి వచ్చిన మనిషి ధనం సంపాదించింది మన ఇంట్లో గుప్పడానికేనా? ఆయనకూ కొడుకులున్నారు. మీరే ఆశలతో డబ్బు సంపాదించారో ఆయనా అవే ఆశలతో సంపాదించి ఉంటాడు. కొంచం ఆలోచించి చూస్తే ఆయనకు పుత్రులెవరూ లేకపోయినా మనం వాళ్లదగ్గర్నుంచి కట్నం ఆశించకూడదు. కూతురిపై ప్రేమ ఉంటే తన ఆస్తిని ఆమె పేర రాసేయడా? అలా చేయకండా ఏ సంస్థకైనా చెందేట్లు వీలునామా వ్రాసి వదేస్తాడనుకుందాం. దాంట్లోనూ తప్పు లేదు. అల్లుడు తన ఆశయాలను అనుసరించేవాడు లాగానూ ప్రజోపయోగ్యమైన కార్యాలు నిర్వహించేవాడుగానూ అగుపడితే తప్పకండా అతని పేరనే వ్రాసేస్తాడు. లేకపోతే తనిష్టం వచ్చినట్లుగా చేసి సుఖంగా జీవయాత్ర సాగిస్తాడు. అతడు తన సంపాదనని సద్వినియోగంచేసినా, దుర్వినియోగపరచినా మనకు జోక్యం ఉండకూడదు. అంతేకాని మనం నిర్బంధపెట్టి అతని మనస్సుకి విరుద్ధమైన విధంగా నడిపిస్తే లాభమేమిటి? ఎంతైనా మనం పరుల ఆస్తిని ఏ సమయంలోనైనా ఆశించుట తప్పే.

మీరు నన్ను బి. ఏ. దాకా చదివించారు. కొంతమట్టుకు గొప్పచదువే చదివించారు. నన్నిలా చదివించడంలో, ప్రస్తుతం మీప్రవర్తనబట్టిచూస్తే, నా అభివృద్ధి మీ ఉద్దేశం కానట్లుగావుంది. పెళ్లిబేరాల్లో వేలు లాగడానికి వీలుంటుందనే చదివించారన్నమాట. మీరీ చదువు చదివించిన కారణంగానే నేనీనాడు మీ మాటవిని ఉల్లంఘించ గలిగాను. నాతోబాటు చదువుకున్న జగన్నాథమూ, శ్రీనివాసరావూ తండ్రుల ఆజ్ఞల ప్రకారం వరశుల్క వివాహాన్ని ఒప్పుకోలేదా అంటారేమో మీరు. ఒప్పుకున్నారు. కాదనను. దానికీ కొంచం కారణంఉంది. మేం చదివే చదువుకూ, ఆర్జించే విజ్ఞానానికీ, అన్ని వస్తువులకు మల్లేనే, రెండుప్రక్కలున్నాయి—ఒక ప్రక్క వెలుతురూ, మరోప్రక్క చీకటి. మేమందరమూ పొందింది ఒకటే విద్య. అయితే, చూడగలిగింది మాత్రం భిన్నపార్శ్వాలు. నేను వెలుతురున్న ముందువైపు చూసివుంటాను. మీదృష్టిలో జగన్నాథము, శ్రీనివాసరావులే వెలుతురునీ, నేను చీకటినీ చూసివుంటాము, ఎందుకంటే, వివాహసమయంలో ఇవ్వాల్సిన వరశుల్కం తాలూకు కొంతడబ్బు ఇంకా ఇవ్వ

లేదని శ్రీనివాసరావు భార్యని పుట్టింటినించి తీసుకురాకండా ఉండడమూ, జగన్నాథం పుట్టింటికి ఒక్కసారికూడా పంపకండా ప్రతి రోజూ భార్యని మూర్ఛపోయేదాకా కొడుతూ మరణ పర్యంతం చేస్తూవుండడం చూస్తున్నారు కనుక తమకొడుకుల కార్యదక్షతకు ఆ తండ్రులు 'సెహభాష్' అంటున్నారేమో! మీరూ అలానే అనదలచారేమో! మీరే నిర్ణయించండి.

మీరు నన్ను గారాబంగా పెంచి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నప్పుడు నా భవితవ్యాన్ని గురించి కలలు కని ఉంటారు. తలిదండ్రుల కందరికీ ఇది సర్వసామాన్యం. మావాడు గొప్పగా చదవాలి. నలుగురిలో పేరు ప్రతిష్టలు కలిగి మెలగాలి, అని ఊహించి ఉంటారు. ఈ ఊహలు మీకున్న పుత్రవాత్సల్యాన్ని ప్రకటిస్తాయి. అయితే పేరు ప్రతిష్టలు ఎలా వస్తాయని అనుకున్నారో నేనూహించలేకండా ఉన్నాను. వేలకువేలు పరశుల్కం లాగడం ద్వారా అవి వస్తాయనుకున్నారో, మరి ఒకరి సంసారంలో చిచ్చుంటించి స్వీయ సంసారం వృద్ధిచేసికోవడం ద్వారా వస్తాయనుకున్నారో! మీరు నా భవిష్యజ్జీవితం సుఖంగా గడవాలనే అభిలాషతో పెళ్ళి సంబంధంలో కొంత ఆర్జించా లనుకుంటున్నారు. నాగురించి మీకున్న ఇంతటి ఘనమైన వాత్సల్యానికి కేలుమోడుస్తాను. కాని నేను దుష్ట సాంగత్యంలో పడితే మీరెన్ని వేలు సంపాదించి పోతేమాత్రం ఆగుతాయా? కన్ను మూసి తెరచే లోపల అవన్నీ మాయమౌతాయి వృద్ధిపొందే సామర్థ్యం నాలో ఉండాలిగాని సంపద-ఒకటికి కోటి కాదూ?

మీకు తెలిసిన విషయాల్నే పునఃపునః ఉల్లేఖించడం నాకేమీ బాగనిపించడం లేదు. నేను వ్రాయగలిగింది కూడా ఇంతకంటే లేదు. తుదిమాట - మనం మానవులం నాన్నగారూ! దయా, జాలి, అనుతాపం అనుకంపా ఇవీ మానవునిలో ఉండాల్సిన ముఖ్యగుణాలు, అని మీరే నాకు ఎన్నోమార్లు చెప్పారు. ఈ నాడు మీరే ఆ విషయాన్ని విస్మరించారు. ఒకసారి చర్విత చరణం కావించుకోండి.

నా హృదయం విప్పి మీ ముందుంచాను. ఇక మీ ఇష్టం. నన్ను మానవుణ్ణి చేసినా, పశువుగా మార్చినా నాకభ్యంతరం లేదు. శాఖోపశాఖలు వేసి, అనంతంగా వ్యాపించి ప్రపంచానికి నీడ నిచ్చే వటవృక్షంగా మారుస్తారో, లేక పూజామందిరంలోని కిటికీలో తొట్టిలో ఉంచిన తులసిమొక్కలా ఉంచుతారో నిర్ణయించుకోండి. చే చేతుల్తో పెంచిన మొక్కని మీరే త్రుంచివేస్తూంటే నే నొద్దనను; మీ కొడుక్కి వ్యక్తిత్వం కల్పించాలని ఉందో లేక....

మీకు నేను అవసరమని తోస్తే ఈ ఉత్తరం తెచ్చిన అబ్బాయి వెంట వొచ్చేయండి. మీ ఆజ్ఞకు సర్వదా బద్ధుణ్ణి.

ఇట్లు,
మీ పుత్రుడు కామేశ్వర్.

ఉత్తరం చదివేసరికి మంచులా పేరిపోయిన సుబ్బారాయుని గుండె కరిగిపోయింది. కళ్ల లోంచి అశ్రువులు రాలిపడినై. సమావేశంలో కొడుకు ఉపన్యాసం, పొగడ్తలు విన్న తరువాత అతడు కీర్తిలక్ష్మికి దాసుడైపోయాడు. కాని కొడుకు వ్రాసిన ఈ ఉత్తరం చదివేసరికి కీర్తికంటే ముఖ్యమైంది మరొకటేదో ఉందని గోచరించింది. అది మానవత్వం! అజరామరమైన సత్యం! మానవుణ్ణి దేవతగా నులిచే సత్యం! నిత్యమైనది అదొక్కటే. సుబ్బారాయుని హృదయం ముక్తికాంతాకృష్టమైపోయింది.

భార్య ప్రశ్నార్థకంగా భర్త కళ్ళలోకి చూసింది.

అతను విప్పారిన ముఖంతో చిన్నగా నవ్వాడు.

ఉత్తరం తెచ్చిన అబ్బాయిని సంబోధించి "పద, బాబూ!" అన్నాడు. ★